క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు



రెంటచింతల: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు రెంటచింతల గ్రామ కార్యదర్శి బి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు వారి సమస్యలను ఈ సభద్వారా తెలియచేస్తే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పీ-ఫోర్ సర్వే ద్వారా గ్రామంలో మొత్తం 539 బంగారు కుటుంబాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీఆర్‌ఓ విఘ్నేష్, గ్రామ పెద్దలు మూలి రాజారెడ్డి, బోయ నాగిరెడ్డి, యేచూరి కొండలు, మారాసు శ్రీను, షేక్ బుజ్జి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాలువాయి సహకార సంఘం చైర్‌పర్సన్‌గా నాగలక్ష్మి



రెంటచింతల: మండలంలోని పాలువాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్‌గా పాలువాయి గ్రామానికి చెందిన అల్లం నాగలక్ష్మి బాధ్యతలు చేపట్టినట్లు మాచర్ల జీడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.కరుణాకర్‌బాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్ బాబు మాట్లాడుతూ పాలువాయి సహకార సంఘంలో మొత్తం 2658 మంది రైతులు సభ్యత్వం ఉందన్నారు. ఇప్పటి వరకు రైతులకు సుమారు రూ. 20 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. రైతుల శ్రేయస్సు కోసం బ్యాంక్ రుణాలు అందించడంలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శౌంతిరెడ్డి నాగమ్మ నర్సిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టి.నర్సిహారావు, సూపర్‌వైజర్ తంగిరాల అంజిరెడ్డి, కార్యదర్శి తుమ్మా రాజ సాగర్ రెడ్డి, సహకార సంఘం నంబర్లు పోలా పున్నయ్య, కొర్రా కొండానాయక్ నాయకులు అల్లం బ్రహ్మారెడ్డి, కావూరి నాగయ్య పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణ అవగాహన సదస్సు

కారెంపూడి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు గురువారం నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. చెడు వ్యసనాల వల్ల చదువుకోలేక పోతారని భవిష్యత్తు నాశనం అయిపోతుందని చివరకు ప్రాణాంతకంగా మారతాయని హెచ్చరించారు. గంజాయి లాంటి మహమ్మారి వల్ల వచ్చే అనర్థాలను గుర్తించి దానికి దూరంగా ఉండాలని కోరారు. యువత గంజాయి మత్తులో జీవితాలను పాడుచేసుకుంటున్నారని దానికి దూరంగా ఉండాలని కోరారు. మంచి ఆరోగ్యం కోసం నిత్యం వ్యాయామం చేయడం యోగా చేయడం అలవర్చుకోవాలని మంచి ఆరోగ్యంతోనే విద్యాభ్యాసం మంచిగా సాగుతుందన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నా.. విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గురజాల పట్టణంలోని న్యాయవాదులు గురువారం అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కర్ర చిన కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, మందపాటి శ్రీనివాసరెడ్డి, కలివెల ప్రభుదాసు, కనకం ఆదినారయణ, దొప్పలపూడి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

నడికుడి మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా భారతి



దాచేపల్లి: గురజాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ (నడికుడి)చైర్‌పర్సన్‌గా దాచేపల్లి మాజీ సర్పంచ్ బెల్లంకొండ భారతి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు ఆమె గురువారం తెలిపారు. దాచేపల్లి సర్పంచిగా భారతి గతంలో పనిచేశారు. ఆమె భర్త బెల్లంకొండ చంద్రశేఖర్ టీడీపీ మండల కన్వీనర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నాడు. మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్‌గా భారతి నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.

మోసం.. బాబు నైజం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వ మోసాలను విస్తృతంగా ప్రచారం చేద్దాం
- మాచర్లలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' సభ

మాచర్ల: రాష్ట్రంలో ప్రతిసారీ అధికారంలోకి రావటం కోసం బాబు ముందు గ్యారెంటీ ఇచ్చి ఆ తరువాత మోసగించటమనేది అలవాటుగా మారిందని దుర్గి జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు వెలిదండి గోపాల్, యరబోతుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంభంపాటి విజయ్‌లు అన్నారు. గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మాచర్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దుర్గి మండల నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని దుర్గి మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం పెద్దబ్బాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రావటం కోసం చంద్రబాబు ఎప్పుడూ ప్రజలను మోసగించటమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికీ సూపర్ సిక్స్ అని చెప్పి 15 నెలలైనా ఏ ఒక్క పథకాన్ని సరిగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ఇటువంటి విధానాలను అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వం పై గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేద్దాం..

వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకెళ్తామన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వ మోసాన్ని విస్తృతంగా ప్రచారం చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేవరకు తాము వెనుకాడేది లేదంటూ ప్రతిజ్ఞ చేశారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్సార్‌కు నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురెడ్డి కోటిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ జలీల్, దుర్గి మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు యేరువ ప్రతాప్‌రెడ్డి, మాచర్ల సుందరరావు, మద్దికర శ్రీనివాసరెడ్డి, కంభంపాటి భాస్కర్, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాలా రామయ్య, షేక్ హుస్సేన్, సంక్రాంతి సీతయ్య, మాదాల బుచ్చయ్య, తేరాల కొండలు, అనంతరావమ్మ, బాలమ్మ, బొంగురు, పాదిలి అంజి యాదవ్, సుబ్రహ్మణ్యం నాయక్, ఆయా గ్రామాల నుంచి భారీస్థాయిలో తరలివచ్చి సమావేశంలో పాల్గొన్నారు.

అదానీకి లాభం చేకూర్చేందుకు పని చేస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారపు శివనాగేశ్వరరావు



సత్తెనపల్లి: రాష్ట్రంలో అదానీ కంపెనీకి లాభాలను చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన విద్యుత్ బకాయిలను ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.18 వేల కోట్లు విద్యుత్ భారాలను ప్రజలపై మోపారన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లను బిగిస్తే వాటిని పగలగొట్టాలని ప్రజలకు చంద్రబాబు, నారా లోకేష్ పిలుపునిచ్చారని, అధికారం చేపట్టిన తరువాత ఆ స్మార్ట్ మీటర్లను బిగించుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులు ముందుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని, డబ్బు ఉంటేనే కరెంట్ సరఫరా అవుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు అంటే ప్రజలను దోపిడీ చెయ్యడమేనని, స్మార్ట్ మీటర్ల ఖర్చును వినియోగదారులు వాయిదాల రూపంలో చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేత



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ యూనిట్, క్యాబ్ రూట్ వారి ఆధ్వర్యంలో టీబీ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్ల పంపిణీ గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ... పౌష్టికాహారం తీసుకోవటం వలన టీబీ రోగులకు ఉపశమనం లభిస్తుందని, తప్పనిసరిగా ఈ న్యూట్రిషన్ ఫుడ్ వాడాలని సూచించారు. డాక్టర్ రమాదేవి, ఫౌండేషన్ సభ్యులు, టీబీ యూనిట్ సిబ్బంది ఎస్.అరుణ, సీహెచ్ అర్జున్, ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శి హనుమంతరావుపై దాడి దుర్మార్గం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రవిబాబు



హనుమంతరావుపై దాడిని ఖండిస్తూ కరపత్రాలు పంపిణీ చేసిన సీపీఎం నాయకులు

దొడ్లేరు(క్రోసూరు): ప్రజా సమస్యలపై పని చేస్తున్న సీపీఎం క్రోసూరు మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావుపై టీడీపీ మండలం అధ్యక్షుడు మొగల్ జాన్ అతని తమ్ముడు దాడి చేయడాన్ని ప్రజలు తీవ్రంగా ఖండించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. గురువారం దొడ్లేరు గ్రామంలో సీజీజీబీ బ్యాంక్‌లో బంగారం కోల్పోయిన రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సీపీఎం పార్టీ దొడ్లేరు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పని చేస్తున్నట్లు తెలిపారు. అమరావతి-బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల వల్ల గ్రామంలో ఇళ్లు, ప్రహరీ గోడలు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయం చూడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. ప్రజలకు నష్టం జరగకుండా విస్తరణ పనులు చేయమని చెప్పడం జరిగిందని.. అదే విధంగా చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంకులో బంగారం తనఖా పెట్టుకున్న అప్పటి బ్యాంకు అప్రైజర్ నాగార్జున, బ్యాంక్ అధికారులు, మరి కొంతమంది చేసిన మోసం వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఆందోళనలు, పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పోరాటాలలో కీలకంగా ఉన్న హనుమంతరావుపై దాడి చేయడం దుర్మార్గమని ఈ దాడిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. టీడీపీకి ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే అప్రజాస్వామికంగా ఆటవిక సంస్కృతికి పాల్పడిన మొగల్ జాన్‌పై చర్యలు తీసుకొని మండల అధ్యక్షుడు స్థానం నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



రాజుపాలెం: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్ తెలిపారు. మండలంలోని మొక్కపాడులో డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఈ నెల 30వ తేదీ లోపు ఇంటింటికి వెళ్లి డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ రవితేజ నాయక్ సూచించారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, చర్మంపై దద్దుర్లు ఉంటే డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ శివ మాధవి, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల పెంపులో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

డీఈఓ చంద్రకళ



శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్న సంసిద్ స్కూల్లో జిల్లా స్థాయిలో 227 మంది ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయాభావం, క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను విద్యార్థులకు బోధించాలన్నారు. 60 మంది విద్యార్థుల సంఖ్య దాటిన ప్రైమరీ స్కూల్స్ జిల్లాలో 463 ఉండగా ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు పర్యవేక్షణ లో ప్రత్యేకంగా బోధిస్తున్నారన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవటం ద్వారా ప్రతి పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతం నూరుశాతం పెరుగుతుందన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రతి విద్యార్థి చదవటం రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలను చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉపాధ్యాయులు దృష్టిలో ఉంచుకుని తగినరీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి సుభాని, ఎంఈఓ పుసులూరి లలితకుమారి, ఏఎంఓ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి



లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): పిడుగుపాటుకు గురై గేదె, దూడ మృత్యువాత పడిన ఘటన మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన నడికట్టు మస్తానమ్మ గేదెలు మేపేందుకు దక్షిణం వైపు పొలాలకు వెళ్లింది. సాయంత్రానికి ఆకాశం మేఘావృతం కావటంతో ఇంటికి బయలుదేరింది. మార్గంమధ్యలో పిడుగు పడటంతో గేదె, పక్కనే ఉన్న మరో దూడ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. పిడుగుపాటుకు మస్తానమ్మ కూడా కింద పడిపోయింది. ఆమె కంటిచూపు కొద్దిగా లోపించినట్లు గ్రామస్తులు తెలిపారు. చనిపోయిన గేదెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

కారంచేడు దళిత మృతవీరులను స్మరించుకుందాం

కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ



ప్రజాచైతన్యయాత్ర ప్రారంభిస్తున్న కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, నాయకులు

నరసరావుపేట: కారంచేడు నరమేధానికి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చుండూరు వరకు దళిత మృతవీరుల్ని స్మరించుకుందామని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రజా చైతన్యయాత్ర ప్రారంభించారు. కృష్ణ మాట్లాడుతూ కారంచేడు నరమేథం జరిగిన నాటికి నేటికీ అగ్రకుల ఆధిపత్య కులాల శక్తుల చేతుల్లో ప్రతినిత్యం ఏదో ఒక చోట దళిత, పీడిత కులాల ప్రజలు దాడులు, హత్యలు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులతో పాటు ప్రజాస్వామికవాదులు, ఉద్యమ సంఘాలు పాల్గొని విజయవంతం చేయా లని విజ్ఞప్తి చేశారు. కారంచేడు దళిత మృతవీరులకు నివాళులు అర్పించిన అనంతరం పట్టణంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్న ప్రసాదు, జిల్లా సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్.రాజశేఖర్, పీడీఎం సీనియర్ నాయకుడు నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాస రావు, సామాజిక కార్యకర్త కృష్ణానాయక్, కేఎన్‌పీఎస్ సభ్యులు సుజాత ఉన్నారు.

తపాలా శాఖలో అధునాతన సేవలు

- 19 నుంచి 21వ తేదీ వరకు సేవలు నిలిపివేత
- 22 నుంచి సేవలు పునః ప్రారంభం

నరసరావుపేటటౌన్: వినియోగదారులు ఇంటి నుంచే సేవల్ని పొందేలా ఈ నెల 22వ తేదీ నుంచి అధునాతన తపాలా సాంకేతికత విధానాన్ని అమలు చేయనున్నట్లు తపాలా శాఖ నరసరావుపేట డివిజన్ సూపరింటెండెంట్ మొహమ్మద్ జాఫర్ సాదిక్ గురువారం తెలిపారు. సేవల్లో సామర్థ్యం పెంపు, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీల నిర్వహణతో పాటు మెరుగైన ట్రాకింగ్‌తో వినియోగదారులకు సేవల్ని అందించడం నూతన సేవల ఉద్దేశం అన్నారు. నరసరావుపేట డివిజన్ పరిధిలోని 449 తపాలా కార్యాలయాల్లో ఈ విధానం అమలవుతుందని తెలిపారు. నూతన సంస్కరణలో భాగంగా ఈ నెల 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు తపాలా కార్యాలయాల్లో సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వివరించారు. తేదీ 22వ తేదీ నుంచి తపాలా కార్యాలయాల్లో సేవలు పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

'రాజకీయ ప్రచారానికే కిసాన్ మేళా'

పిడుగురాళ్ల: రాజకీయ ప్రచారానికే కూటమి నేతలు కిసాన్ మేళా నిర్వహించారని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పార్టీ రాష్ట్ర నాయకులు యెనుముల మురళీధర్‌రెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), వీరభద్రునిరామిరెడ్డిలు అన్నారు. పిడుగురాళ్లలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు కూటమి నేతలకు పలు ప్రశ్నలు సంధించారు. గత ఏడాది మద్దతు ధరకు మిర్చి కొనుగోలు చేస్తామని చెప్పి ఎందుకు కొనుగోలు చేయలనదన్నారు. గామాలపాడు పొగాకు కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎందుకు ఆందోళన చేశారో సమాధానం చెప్పాలన్నారు. కూటమి ఏడాది పాలనలో హామీ ఇచ్చిన మేరకు ఎందుకు అన్నదాత సుఖీభవ అమలు చేయలేకపోయారన్నారు. ఈఏడాది వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారని, రైతులకు ఏ విధంగా ఆదుకుంటారన్నారు. అన్నదాతకు మేలు చేసేందుకు మేళాలు నిర్వహించాలి గానీ మోసం చేసేందుకు కాదని వారు హితవు పలికారు.

స్మృతివనానికి స్థలం కేటాయింపు హర్షణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నేతలు

మాచర్ల: తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచేలా 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని తీసుకొచ్చిన మహనీయులు పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు అమరావతిలో 7 ఎకరాల స్థలం కేటాయించటం సంతోషకరమని మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. గురువారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, వీసీఐ మెంబర్ మేడం నాగేశ్వరరావు, కౌన్సిలర్ గట్లా కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

వెల్దుర్తి: అసిస్టు సంస్థ వారు మండలంలోని వివిధ పాఠశాలలకు 13 మంది విద్యావలంటీర్లను, వారి సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారని మండల విద్యాశాఖాధికారి ఎండీ ఖాశిం తెలిపారు. వెల్దుర్తి ఎంపీపీ మెయిన్ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెయిన్ పాఠశాల ఉపాధ్యాయులు సమష్టి కృషితో 62 మంది నూతన విద్యార్థులు చేరాలా కృషి చేశారన్నారు. మండలంలో ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ 19 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులను కేటాయించారని, ఉపాధ్యాయులందరూ సమష్టి కృషితో మండలాన్ని, విద్యలో జిల్లాలోనే అగ్రస్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- రూ.1,19,400 విలువైన విత్తనాలు సీజ్
- 1.2 టన్నుల ఎరువులు సైతం..
- ముప్పాళ్లలో రూ.35,400 విలువ గల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల



దొడ్లేరు శ్రీనివాస ఫెర్టిలైజర్స్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు



ముప్పాళ్లలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిటీ సభ్యులు బుజ్జిబాబు, వ్యవసాయ అధికారులు

క్రోసూరు: విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు గురువారం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా క్రోసూరులోని లక్ష్మీనరసింహ ఎంటర్‌ప్రైజెస్ విత్తనాల షాపులో అనుమతి పత్రాలు లేని కారణంగా రూ.1,19,400 విలువ కలిగిన విత్తన అమ్మకాలను నిలుపుదల చేశారు. దొడ్లేరు గ్రామంలోని శ్రీనివాస ఫెర్టిలైజర్స్‌లో అనుమతి పత్రాలు లేని 1.2 టన్నుల ఎరువులను సీజ్ చేసి ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణ యజమానులు చట్ట ప్రకారం వ్యాపారాలు చేయాలని, నిబంధనలను అతిక్రమించితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అపర్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు (విత్తన పరీక్ష కేంద్రం), నెల్లూరు కన్నయ్య, ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్‌లు నిర్వహించాలని అంతర జిల్లా కమిటీ సభ్యులు పీ బుజ్జిబాబు చెప్పారు. మండల పరిధిలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం తనిఖీ చేశబూరు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు అంతర జిల్లా కమిటీ సభ్యులుగా నియమితులైన ఏలూరు జిల్లా కోటరామచంద్రాపురం సహాయ వ్యవసాయ సహాయకులు బుజ్జిబాబు, విజయవాడ రీజనల్ విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ ఉమర్, సత్తెనపల్లి, ముప్పాళ్ళ వ్యవసాయాధికారులు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డిలు బృందంగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా దుకాణాల్లో స్టాక్ బుక్స్, బిల్లులు, నిల్వలు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా అమ్మకాలు జరుపుతున్న రూ.35,400 విలువ గల 41.6 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. స్టాక్ వివరాలను స్టాక్ బోర్డ్‌లో ప్రదర్శించాలని, ప్రభుత్వ అనుమతి ఉన్న పురుగుమందులు, విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. విత్తనాలు అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, పాకెట్‌పై, కొనుగోలు రశీదుపై లాట్ నెంబర్ ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



మునగోడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

అమరావతి: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు అమర్చుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల రూరల్ కార్యదర్శి సయ్యద్ మొహిద్దీన్ వలి మాట్లాడుతూ అదానీ కంపెనీతో ఒప్పందాలు చేసుకొని ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై విద్యుత్ భారాలు మోపడాన్ని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. ఇప్పటికే పాత బకాయిల పేరుతో ప్రజలపై భారం మోపటం దారుణమన్నారు. ప్రీపెయిడ్ మీటర్‌లతో అదనపు బిల్లులు వసూలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. స్మార్ట్‌మీటరు బిగిస్తే సెల్‌ఫోను పద్ధతిలో ముందుగానే రీచార్జి చేసుకోవాలని దీంతో విద్యుత్ సంస్థల జవాబు దారీతనం లోపిస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండి..అడ్డుపడండి.. అని నారా లోకేష్ పిలుపునిచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చటం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఇంటి యజమాని అనుమతి లేకుండా మీటర్ బిగించే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు.